క్లుప్తంగా

బాధిత కుటుంబానికి సాయం



బాధిత కుటుంబానికి సాయం చేస్తున్న ఏఎస్‌వో తదితరులు

తాళ్లపూడి: ప్రక్కిలంక పంచాయతీ పరిధిలోని పైడిమెట్ట గ్రామంలో సోమవారం సంభవించిన అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన దేవరపల్లి కిషోర్ కుటుంబానికి మండల ఏఎస్‌వో జె.వెంకటేశ్వరరావు మిత్ర బృందం బుధవారం సాయం చేసింది. ఏఎస్‌వో వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రూ.6 వేల నగదు, దుస్తులు పెట్టుకునే ట్రంక్ పెట్టె అందజేశారు. ఆర్ఐ కిషోర్ రూ.1000, జి.దుర్గాభవాని రూ.1000, నిరంజన్ రూ.500, జి.రుచిత రూ.500, జె.వెంకటేశ్వరరావు రూ.500, సబీర్ బాషా రూ.500, ఇంకా మరి కొందరు తమ వంతు సాయం చేశారు.

ఎంపీడీవోగా ప్రసాద్‌కు పూర్తి అదనపు బాధ్యతలు

ఉండ్రాజవరం: స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో)గా ఈవోపీఆర్డీ జేడీపీ ప్రసాద్ బుధవారం పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఎంపీడీవోగా పనిచేస్తున్న కె.నరేంద్రరెడ్డి వ్యక్తిగత పనులపై సెలవుపై వెళ్లడంతో ప్రసాద్ ఎంఈడీవోగా ఆదనపు బాధ్యతలు స్వీకరించారు.

పుల్లారావుకు మండలి చైర్మన్ పరామర్శ



వేములూరులో పుల్లారావును పరామర్శిస్తున్న మండలి చైర్మన్ మోషేన్‌రాజు

కొవ్వూరు: మండలంలోని వేములూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు సాకా పుల్లారావును శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు పరామర్శించారు. ఇటీవల పుల్లారావు కుమారుడు మృతి చెందారు. దీంతో మోషేన్‌రాజు బుధవారం పుల్లారావు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.వైఎస్సార్‌సీపీ నాయకుడు కంఠమణి రమేష్, బొంతా శ్యాం రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమ డెల్టాకు నీటి విడుదల పెంపు



నిడదవోలులో పశ్చిమ డెల్టా ప్రధాన కాలువ

నిడదవోలు: విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ నుంచి పశ్చిమ డెల్టా ప్రధాన కాలువకు జలవనరుల శాఖ అధికారులు బుధవారం 6,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పశ్చిమ డెల్టా పరిధిలో ఖరీఫ్ సాగునీటి అవసరాల మేరకు క్రమక్రమంగా నీటి విడుదలను పెంచుతున్నారు. వారం రోజులుగా డెల్టా కాలువలకు 5,000 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తుండగా, రైతుల డిమాండ్ మేరకు తాజాగా నీటి విడుదలను పెంచారు. ఈ క్రమంలో పశ్చిమ డెల్టా పరిధిలోని ఏలూరు కాలువకు 936, నరసాపురం కాలువకు 2093, అత్తిలి కాలువకు 298, తణుకు కాలువకు 936, ఉండి కాలువకు 1106 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం గోదావరి నీటి మట్టం 13.99 మీటర్ల వద్ద ఉంది.

వివరాలు ఆన్‌లైన్ చేయించుకోండి

నల్లజర్ల: స్థానిక సహకార సంఘ సభ్యులందరూ తమ వివరాలను ఆన్‌లైన్ చేయించుకోవాలని ఆ సంఘం సీఈఓ గంటా శివరామారావు కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు సంఘ రికార్డులన్నీ డిజిటలైజేషన్ చేయవలసి ఉందన్నారు. కొంతకాలంగా ఎలాంటి లావాదేవీలు జరపని సంఘ సభ్యులు విధిగా తమ ఆధార్ జిరాక్స్, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఫోన్ నంబరు సొసైటీకి సమర్పించి ఆన్‌లైన్ చేయించుకోవాలన్నారు.

రాగోలపల్లి, తాడిపూడి సొసైటీల్లో..

తాళ్లపూడి: మండలంలోని రాగోలపల్లి సొసైటీ పరిధిలోని పోచవరం, తుపాకులగూడెం, రాగోలపల్లి గ్రామాల సభ్యులు, తాడిపూడి సొసైటీ పరిధిలోని సభ్యులు తమ రికార్డులను ఆన్‌లైన్ చేయించుకోవాలని రాగోలపల్లి సొసైటీ కార్యదర్శి కింతాడ భాస్కరరావు, తాడిపూడి సొసైటీ కార్యదర్శి బొర్రా రామచంద్రం బుధవారం కోరారు. ఆధార్ కార్డు జిరా క్స్, ఫోన్ నంబర్, ఫోటోతో సొసైటీల వద్ద సంప్రదించాలన్నారు.

65 గోవులకు వైద్య పరీక్షలు

ద్వారకాతిరుమల: శ్రీవారి గో సంరక్షణ శాలలోని గోవులకు మంగళ, బుధవారాల్లో వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 65 ఆవులకు మండల పశువైద్యాధికారి అంగర సురేష్ గర్భకోశ వ్యాధుల పరీక్షలు, చూలి నిర్ధారణ పరీక్షలు చేశారు. అలాగే అన్ని ఆవులకూ గొంతు వాపు వ్యాధి టీకాలు వేశారు. కార్యక్రమంలో గోసంరక్షణ శాల ఏఈఓ పి.నట రాజారావు, సూపరింటెండెంట్ కిషోర్ పాల్గొన్నారు.

ఎల్‌పీఎం జాప్యం.. రిజిస్ట్రేషన్లకు విఘాతం

- ల్యాండ్ పార్సిల్ నంబర్ అప్రూవల్ కాకపోవడమే కారణం
- డివిజన్ పరిధిలో మొత్తం 125 గ్రామాలు
- 42 గ్రామాల్లో నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లు
- ప్రభుత్వాదాయానికి భారీగా గండి
- మార్గదర్శకాల కోసం ఎదురుచూపులు



కొవ్వూరులోని జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

కొవ్వూరు: డివిజన్‌లోని కొన్ని గ్రామాల్లో భూముల రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు అంతరాయం ఏర్పడింది. ల్యాండ్ పార్సిల్ నంబర్ (ఎల్‌పీఎం)లు అప్రూవల్ కాకపోవడమే ఇందుకు కారణం. ఫలితంగా సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మూడు నెలలుగా రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయానికి భారీగా గండి పడింది. సమగ్ర భూ సర్వే పూర్తయిన గ్రామాల్లో భూముల వివరాలను రెవెన్యూ శాఖ వెబ్‌ల్యాండ్‌లో అప్‌లోడ్ చేసింది. వాటిని రిజిస్ట్రేషన్ శాఖ మ్యాపింగ్ చేయాల్సి ఉంటుంది. డివిజన్ స్థాయిలో ఉండే మార్కెట్ వాల్యూ కమిటీలు భూముల ప్రభుత్వ ధరలను అప్రూవల్ చేస్తేనే వాటికి చట్టబద్ధత లభిస్తుంది. రుడా (రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ) పరిధిలోని గ్రామాల్లో ఈ కమిటీకి జాయింట్ కలెక్టర్ చైర్మన్ గాను, స్థానిక సబ్ రిజిస్ట్రార్ కన్వీనర్‌గాను, జెడ్పీ సీఈవో, రుడా వైస్ చైర్మన్‌లు సభ్యులుగా ఉంటారు. ఇక రూరల్ పరిధిలోని గ్రామాల్లో ఈ కమిటీకి ఆర్డీవో చైర్మన్‌గాను ఎంపీడీవో, తహసీల్దార్, మార్కెట్ వ్యాల్యూ ఆడిట్ అండ్ డిస్ట్రిక్ రిజిస్ట్రార్‌లు సభ్యులుగా ఉంటారు. రెవెన్యూ శాఖ ఆన్‌లైన్ (వెబ్ ల్యాండ్)లో అప్‌లోడ్ చేసిన భూములకు కమిటీ అప్రూవల్ పొందిన తర్వాత స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ వాటిని మ్యాపింగ్ చేయడం ద్వారా ఆ భూముల వివరాల డేటా ఆన్‌లైన్‌లో కనిపిస్తుంది. ఈ ప్రక్రియ అంతా పూర్తయితేనే రిజిస్ట్రేషన్ ప్రక్రియకు వీలుంటుంది. ఈ ప్రక్రియకు కొన్నిచోట్ల ఇప్పటికీ పూర్తికాకపోవడంతో కొవ్వూరు డివిజన్ పరిధిలోని 42 గ్రామాల్లో వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిలిచిపోయింది. కొత్త ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ప్రక్రియపై ఇంకా ఎలాంటి నిర్ణయాన్నీ ప్రకటించలేదు. సాఫ్ట్‌వేర్ మార్పులు,చేర్పులు ఉంటాయా? లేక గత ప్రభుత్వ విధానాన్నే కొనసాగిస్తుందా? అన్నది ఇంకా తేలాల్సి ఉంది. కాగా సమగ్ర భూ సర్వే పట్ల చాలాచోట్ల అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. భూ సర్వే పూర్తయి, ఎల్‌పీఎం నంబర్ అప్రూవల్ కాకుండా పెండింగ్‌లో ఉన్న గ్రామాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియపై ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు విడుదల కావాల్సి ఉంది.

పలు గ్రామాల్లో అంతరాయం

కొవ్వూరు డివిజన్ పరిధిలోని కొవ్వూరు, వేగేశ్వరపురం, నిడదవోలు, అనంతపల్లిలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వాటి పరిధిలో 125 గ్రామాలున్నాయి. కొవ్వూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో దేవరపల్లి మండలంలోని దుద్దుకూరు, గౌరీపట్నం, కొండగూడెం, లక్ష్మీపురం, నిడదవోలు మండలంలోని అమ్మేపల్లి (డిపాపులేటెడ్ విలేజ్) గ్రామాలతో పాటు కొవ్వూరు మండలంలోని ఐ.పంగిడి, దేచెర్ల, పశివేదల, వాడపల్లి, ఆరికిరేవుల, వేములూరు గ్రామాల్లో ఎల్‌పీఎం నంబర్ అప్రూవల్ కాకపోవడంతో వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్‌లు పూర్తిగా నిలిచిపోయాయి. నల్లజర్ల మండలం అనంతపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోని మారెళ్లమూడి, పడమర చోడవరం, దేవరపల్లి మండలం ధుమంతునిగూడెం, త్యాజంపూడి, కురుకూరు గ్రామాల్లోనూ భూముల రిజిస్ట్రేషన్‌ది ఇదే పరిస్థితి. ఈ రిజిస్ట్రార్ ఆఫీస్ పరిధిలో 25 గ్రామాలు ఉంటే, వాటిలోని 20 గ్రామాల్లో సర్వే నెంబర్ ఆధారంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ నడుస్తోంది. మిగిలిన ఐదు గ్రామాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియకు అంతరాయం ఏర్పడింది. తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో 30 గ్రామాలుంటే, రీసర్వే ప్రక్రియ కారణంగా వాటిలో 12 గ్రామాల్లో ఎల్‌పీఎం నంబర్ అప్రూవల్ కాలేదు. నిడదవోలు రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో 46 గ్రామాలుంటే, వాటిలో 13 గ్రామాలదీ ఇదే పరిస్థితి. గత మూడు నెలలుగా ఈ గ్రామాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ఆటంకం ఏర్పడడంతో భూముల కొనుగోలుదారులు, విక్రయందారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నిమ్మ ఎగుమతులపై వర్షాల ప్రభావం



నల్లజర్ల: దేశ రాజధాని ఢిల్లీ పరిసర ప్రాంతాలలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నిమ్మ ఎగుమతులు పడిపోయి ధరలు దిగజారాయి. ఈ వారంలో ఎగుమతులు చేసిన కాయలు భారీ వర్షాల కారణంగా ఢిల్లీ చేరకుండానే పాడైపోయినట్టు వ్యాపారులు చెబుతున్నారు. దీంతో ఎగుమతులు మందగించాయి. ఫలితంగా డిమాండ్ తగ్గి ధరలపై ప్రభావం పడిందంటున్నారు. ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు ఉంటేనే రైతులకు గిట్టుబాటు ధరలు లభిస్తాయి. ప్రస్తుతం చెన్నై, బెంగళూరులకు స్వల్పంగా ఎగుమతులు చేస్తున్నారు.

10న ద్విచక్ర వాహనాల బహిరంగ వేలం

దేవరపల్లి: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) దేవరపల్లి స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలకు ఈ నెల 10వ తేదీ ఉదయం 11 గంటలకు స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు సీఐ కె.వెంకటేశ్వరస్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు తమ ఆధార్ కార్డు తీసుకురావాలని, రూ.5 వేల ధరావతు చెల్లించాలన్నారు. పాట దక్కించుకున్న వారు ఆదే రోజు వేలం సొమ్ముతో పాటు జీఎస్టీ కలిపి చెల్లించాలని తెలిపారు. వివరాలకు దేవరపల్లి స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయండి

- మంత్రి కందుల దుర్గేష్
- సమిశ్రగూడెంలో స్కూల్ కిట్ల పంపిణీ

నిడదవోలు రూరల్: విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అందించి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మండలంలోని సమిశ్రగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం ఆయన స్కూల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో రాణించాలంటే విద్యతోనే సాధ్యమన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పనకు దాతలు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ దేశాబత్తుల జ్యోత్స్న ప్రియాంక, వైస్ ఎంపీపీ వడల రత్నకుమారి, ఎంపీటీసీ సభ్యురాలు అంగర ఝాన్సీ, ఎంపీడీఓ జేఏ ఝాన్సీ, ఎంఈఓ కేవీ గణేష్, హెచ్‌ఎం దివాకర్, కూటమి నాయకులు గోగిన శ్రీనివాసరావు, ఉప్పులూరి రామ్మోహన్‌రావు, ఎండీ అక్రం, శివ, ఎం.రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.



సమిశ్రగూడెంలో స్కూల్ కిట్లు పొందిన విద్యార్థులతో మంత్రి దుర్గేష్ తదితరులు

పెరవలి మండలంలో 3,241 మందికి..

పెరవలి: పేద విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న స్టూడెంట్ కిట్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పెరవలి ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ అన్నారు. మండలంలోని ఖండవల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం ఆయన సూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. ఎంఈఓ బీబీఎస్ స్వరూప్ మాట్లాడుతూ మండలంలోని 48 పాఠశాలల్లోని 3,241 మంది విద్యార్థులకు బుధవారం స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశామన్నారు. ఈ కిట్లు పొందిన వారిలో 1027 మంది ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు, మిగిలిన 2,214 మంది ఉన్నత పాఠశాలల విద్యార్థులన్నారు. వివిధ పాఠశాలల్లో నిర్వహించిన స్కూల్ కిట్ల పంపిణీ కార్యక్రమాల్లో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, కూటమి పార్టీల నాయకులు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఖండవల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థినికి స్టూడెంట్ కిట్ అందిస్తున్న ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్

పొగాకు విక్రయాలపై రైతుల ఆసక్తి

- వేలం కేంద్రాల్లో పెరిగిన బేళ్ల సంఖ్య
- కిలో గరిష్ట ధర రూ. 371
- సగటు ధర రూ. 307.86

దేవరపల్లి: మార్కెట్లో పొగాకు ధర రోజురోజుకూ అనూహ్యంగా పెరగడంతో విక్రయాలకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. వారం రోజుల నుంచి వేలం కేంద్రాలకు రైతులు వేలానికి తీసుకు వస్తున్న బేళ్ల సంఖ్య పెరుగుతోంది. రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని ఐదు వేలం కేంద్రాల పరిధిలో రోజుకు 5 వేల నుంచి 6 వేల బేళ్ల విక్రయాలు జరుగుతున్నాయి. ఒకొక్క వేలం కేంద్రానికి 11 నుంచి 13 వందల బేళ్లు వేలానికి వస్తున్నట్టు అధికారులు తెలిపారు. బుధవారం మార్కెట్‌కు దేవరపల్లి వేలం కేంద్రానికి 1182 బేళ్లు, జంగారెడ్డిగూడెం-1 వేలం కేంద్రానికి 1170 బేళ్లు, జంగారెడ్డిగూడెం -2 వేలం కేంద్రానికి 1332 బేళ్లు, కొయ్యలగూడెం వేలం కేంద్రానికి 1255 బేళ్లు, గోపాలపురం వేలం కేంద్రానికి 951 బేళ్లు వేలానికి వచ్చినట్టు అధికారులు వివరించారు. 5,890 బేళ్లు విక్రయానికి రాగా 5,186 బేళ్లు కొనుగోలు చేసినట్టు పొగాకు బోర్డు రీజినల్ మేనేజరు జీఎల్‌కే ప్రసాద్ తెలిపారు. ఈ ఏడాది ఇప్పటి వరకూ ఐదు వేలం కేంద్రాల్లో 2,76,249 బేళ్లు విక్రయాలు జరిగాయి.



దేవరపల్లి వేలం కేంద్రంలో వేలానికి వచ్చిన పొగాకు బేళ్లు

33.92 మిలియన్ల కిలోల విక్రయాలు

ఐదు వేలం కేంద్రాల్లో ఇప్పటి వరకూ 33.92 మిలియన్ల కిలోల పొగాకు విక్రయాలు జరిగినట్టు ఆర్ఎం ప్రసాద్ తెలిపారు. దీని విలువ రూ. 1041 కోట్లు ఉంది. బుధవారం మార్కెట్లో కిలో గరిష్ట ధర రూ. 371, కనిష్ట ధర రూ. 235, సగటు ధర రూ. 307.86 లభించినట్లు ఆర్ఎం ప్రసాద్ తెలిపారు. రోజుకు సుమారు 6.50 లక్షల కిలోల పొగాకు విక్రయాలు జరుగుతున్నాయి.

రోడ్డు మలుపుల్లో ఆదమరిస్తే ప్రమాదాలు

చాగల్లు: మండలంలోని రహదారుల మలుపులు అనేక చోట్ల ప్రమాదకరంగా ఉన్నాయి. దాంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ మలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు సూచిస్తున్నారు. మండలంలోని కలవలపల్లి-చిక్కాల, చాగల్లు-చిక్కాలపాలెం, నిడదవోలు-పంగిడి ఆర్ అండ్ రహదారి, ధారవరం-కొవ్వూరు, చాగల్లు-నందమూరు, చాగల్లు-పశివేదల రహదారుల్లో ప్రమాదకర మలుపులు ఉన్నాయి. ఇక్కడ వాహనదారులు ఏ మాత్రం ఏమరపాటు వహించినా ప్రమాదం తప్పదు. గతంలో అనేక ద్విచక్ర వాహనదారులు, ఆటోలు ప్రమాదాల బారిన పడ్డాయి. చిక్కాల రోడ్డులోను, నిడదవోలు-పంగిడి రహదారిలోనూ తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. చిక్కాల రోడ్డులో పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో మలుపు వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఈ రోడ్డుపై ఆర్ అండ్ బీ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంపై పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



చాగల్లు - చిక్కాల రోడ్డులో ప్రమాదకరమైన మలుపు



గుబురుగా పెరిగిన పొదలతో ప్రమాదకరంగా ఉన్న చిక్కాల - కలవలపల్లి రోడ్డు మలుపు

సరికొత్తగా సైబర్ నేరాలు.. బీ కేర్‌ఫుల్

విద్యార్థులకు నల్లజర్ల సీఐ దుర్గాప్రసాద్ సూచన

నల్లజర్ల: సైబర్ నేరగాళ్లు సరికొత్త మోసాలకు తెర తీస్తున్నందున విద్యార్థులు అప్రమత్తంగా ఉంటూ తమ తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించాలని నల్లజర్ల సీఐ దుర్గాప్రసాద్ సూచించారు. దూబచర్ల ఎలైట్ జూనియర్ కళాశాలలో బుధవారం సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటివరకూ సైబర్ నేరగాళ్లు ఖాతాదార్లకు ఫోన్లు చేసి ఓటీపీలు, లింక్‌లు, పాస్‌వర్డ్‌ల రుపేణా బ్యాంకు ఖాతాల్లోని నగదు మాయం చేసేవారని, తాజాగా ఆధార్ సంఖ్య, వేలిముద్రల ఆధారంగా దోచేస్తున్నారని వివరించారు. ఖాతాదారులకు తెలియకుండానే వారి ఖాతాల్లో సొమ్ములు మాయం అవుతున్నాయని హెచ్చరించారు. సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చినపుడో బ్యాలెన్స్ చెక్ చేసుకున్నపుడో తప్ప తెలియడం లేదన్నారు. ఆధార్, సంక్షేమ పథకాలు, భూముల క్రయవిక్రయాలు, మొబైల్ సిమ్‌కార్డులు పొందినపుడు వేలిముద్రల నిర్ధారణ తప్పనిసరి అని సీఐ అన్నారు. సంబంధిత డేటాను సైబర్ నేరగాళ్లు కాజేసి వేలిముద్రలు క్లోనింగ్ చేస్తూ మోసాలకు పాల్పడతున్నారన్నారు. ఆధార్ నంబర్ ఎవరికైనా ఇచ్చే ముందు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బ్యాంకులో నగదు తరుచూ పరిశీలిస్తు ఉండాలన్నారు. పెద్ద మొత్తాలను బ్యాంకుల్లో దాచుకోవాల్సి వస్తే ఇద్దరి పేర జాయింట్ అకౌంటులో దాచాలన్నారు.



సైబర్ నేరాలపై ఎలైట్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ దుర్గాప్రసాద్

ప్రథమ చికిత్సా కేంద్రానికి మందుల వితరణ

ద్వారకాతిరుమల: శ్రీవారి దేవస్థానం ప్రాణదాన ట్రస్టు ద్వారా నిర్వహిస్తున్న ప్రథమ చికిత్సా కేంద్రానికి తెనాలికి చెందిన శ్రీశైల భక్తాసేవా సమితి అధ్యక్షుడు ఏవీ సుబ్బయ్య, పి.గోవర్ధన్, కేవీఎన్ గుప్తా వారసుల సహాయంతో నాలుగు వేల మంది భక్తులకు సరిపడా మందులను ఉచితంగా బుధవారం అందజేశారు. వాటిని శ్రీశైల భక్తాసేవాసమితి మెడికల్ ఇన్‌చార్జి ఎం.పూర్ణచంద్రరావు, ఏవీ సాంబశివరావు చేతులు మీదుగా డీఈఓ బాబూరావుకు అందజేశారు.

వ్యాధులకు మూలం కలుషిత తాగునీరు

- కాచి చల్లార్చిన నీటినే తాగండి
- ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజా తిలక్

కొవ్వూరు: వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున కాచి చల్లార్చిన నీటినే తాగాలని, కలుషిత తాగునీరు కారణంగానే అనేక రకాలైన వ్యాధులు వ్యాప్తి చెందుతాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ టి.రాజా తిలక్ పేర్కొన్నారు. స్టాఫ్ డయేరియా కార్యక్రమంలో భాగంగా ప్రజలకు ఈ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు బుధవారం ఆయన మండలంలోని కాపవరం, దొమ్మేరు గ్రామాల్లో పర్యటించారు. రెండుచోట్లా పంచాయతీ సిబ్బందికి, పంచాయతీ ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు తాగునీటి పరీక్ష విధానాన్ని వివరించారు. వారంలో ఒకటి రెండు సార్లు తాగునీటి టెస్టింగ్ చేసుకోవాలని, ఏదైనా వ్యత్యాసం వచ్చినట్టు భావిస్తే కొవ్వూరులోని తాగునీటి పరీక్ష కేంద్రానికి రావాలని రాజా తిలక్ సూచించారు. పంచాయతీ కార్యదర్శి డి.సుబ్బలక్ష్మి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు డి.మోహన్‌కృష్ణ, వెంకటేష్ ,ల్యాబ్ మైక్రో బయాలాజిస్టు డి.సబిత, ల్యాబ్ అసిస్టెంట్ ఎస్ఎస్‌వీ గణేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత నీటినే తాగండి

ఉండ్రాజవరం: కలుషిత నీటిని తాగడం వలన వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున, సురక్షితమైన నీటినే తాగాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భవాని ప్రజలకు సూచించారు. మండలంలోని దమ్మెన్ను గ్రామంలోని వాటర్ ట్యాంకును బుధవారం ఆమె పరిశీలించారు. రక్షిత మంచినీటి వాటర్ ట్యాంకులను క్లోరినేషన్ చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం స్టాప్ డయేరియాపై ఆ గ్రామంలోని బీసీ కాలనీ ప్రజలకు ఆమె అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ క్లోరినేషన్ చేసిన నీటిని, కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గుర్లజర్ల సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి వై.భార్గవీదేవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కొవ్వూరు మండలం దొమ్మేరులో తాగునీటిని పరీక్ష చేస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ సిబ్బంది

సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ

నిడదవోలు: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బంది సూచించారు. స్థానిక ఆరో వార్డు సచివాలయం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాల బారిన పడితే తీసుకోవాల్సిన చికిత్స, జ్వరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను వివరించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఓఆర్ఎస్, జింక్ టాబ్లెట్లు ఆవశ్యకత గురించి తెలియజేశారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు హెల్త్ కార్యదర్శి పార్వతి, అంగన్‌వాడీ టీచర్ కుమారి, ఉమెన్ ప్రొటక్షన్ కార్యదర్శి జీఎస్‌డీ మాధురి, హెచ్‌ఎం సింధు, మాధవి, టి.కుమారి తదితరులు పాల్గొన్నారు.



నిడదవోలు ఆరో వార్డు సచివాలయంలో విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పింఛన్ పంపిణీలో అవకతవకల ఆరోపణలు

ద్వారకాతిరుమల: మండలంలోని పంగిడిగూడెంలో ఈనెల 1, 2 తేదీల్లో జరిగిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో అవకతవకలు జరిగినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రూ. లక్ష మేర పింఛను సొమ్మును వీఆర్వో స్వాహా చేయడంతో, ఆ సొమ్మును ఆమె వద్ద సహాయకుడిగా పని చేస్తున్న ప్రైవేటు వ్యక్తి వెంకటేశ్వరరావు తన బంగారాన్ని తాకట్టు పెట్టి మరీ లబ్ధిదారులకు పంపిణీ చేసినట్టు చెబుతున్నారు. స్థానికుల కథనం ప్రకారం. పంగిడిగూడెంలో 56 మంది లబ్ధిదారులకు పింఛను సొమ్ము పంపిణీ చేసే బాధ్యతను అధికారులు ఆ గ్రామ వీఆర్వో చంద్రలీలకు అప్పగించారు. తొలిరోజు ఆమె 39 మందికి పింఛన్లు అందించారు. మరుసటి రోజు మధ్యాహ్నం సమయానికి నలుగురికి పంపిణీ చేశారు. దాంతో మిగిలిన 17 మంది లబ్ధిదారులూ తమకు పింఛను అందలేదని గగ్గోలు పెట్టడంతో ఆ సొమ్మును వీఆర్వో స్వాహా చేసిందన్న ఆరోపణలు గుప్పుమన్నాయి. దాంతో ఆరోజు మధ్యాహ్నం డిప్యూటీ తహసీల్దార్ దుర్గా మహాలక్ష్మి పంగిడిగూడెంకు వెళ్లి వీఆర్వోతోను, అలాగే లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు సేకరించారు. అయితే కొద్దిసేపటికి మిగిలిన 13 మంది లబ్ధిదారులకు వీఆర్వో పింఛన్ సొమ్ము రూ.89 వేలను అందించారు. దాంతో పూర్తిస్థాయిలో పింఛన్ల పంపిణీ జరిగినట్టు అధికారులు తేల్చారు. దీనిపై డిప్యూటీ తహసీల్దార్ దుర్గామహాలక్ష్మి వివరణ ఇస్తూ పంగిడిగూడెంలో వీఆర్వో చంద్రలీల పింఛన్ల సొమ్ము స్వాహా చేసినట్టు ఆరోపణలు వచ్చాయని, వెంటనే తాను విచారణ జరిపినట్టు తెలిపారు. అయితే సకాలంలోనే ఆమె లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేసిందని చెప్పారు.